# సుగంధ తైల మొక్కలు

మన రాష్ట్రంలో సుగంధ తైలాన్నిచ్చే మొక్కలను వాణిజ్య పరంగా సాగుచేస్తున్నారు. ఈ మొక్కలను మైదాన మరియు ఎత్తైన ప్రదేశాల్లో పెంచటానికి వీలున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర కోస్తా జిల్లాల్లోని ఎత్తైన ప్రాంతాల్లో వర్షాధారంగా సాగుచేయటానికి ఎంతో అవకాశమున్నది. ఈ మొక్కలు ఔషధ పరిశ్రమలకు కావాల్సిన ముడిపదార్థాలను అందించగలవు. అంతేగాక అత్తరుల తయారి, పరిమళాలు, సబ్బుల మరియు సౌందర్యానికి ఉపయోగించే వస్తువుల తయారీ కర్మాగారాల్లో ఈ మొక్కల నుండి తీసిన తైలాన్ని విరివిగా వాడుచున్నారు.

ఈ సుగంధ తైలాన్నిచ్చే మొక్కలను కనీసం 10-15 ఎకరాల్లో సాగు చేస్తేనే లాభదాయకం. అంతేగాక అరటన్ను నుండి టన్ను సామర్థ్యం గల తైలంతీసే (డిస్టిలేషన్) యంత్రాన్ని కూడ కల్గియుండాలి. కనీసం 15-20 రోజులకోసారి నీరు ఇచ్చే సదుపాయమున్నట్లయితేనే ఈ పంటల సాగు ఆర్థికంగా లాభదాయకం. సుగంధ తైలాల ధరలలో తరుచుగా హెచ్చు తగ్గులు వస్తుంటాయి. మొదటి సంవత్సరములోనే లాభాల నాశించలేము. మార్కెట్ పై పూర్తి అవగాహన వచ్చిన తర్వాత మాత్రమే వాటి సాగు చేపట్టాలి.

## నిమ్మ గడ్డి (లెమన్ గ్రాస్)

ఇది బహువార్షిక జాతికి చెందిన గడ్డి మొక్క. షుమారు 3 నుండి 4 అడుగుల ఎత్తు పెరుగుతుంది. నేల కోతను అరికట్టటానికి ఈ పంటసాగు శ్రేష్ఠమైనది. దీని తైలాన్ని పరిమళాల పరిశ్రమలోను మరియు విటమిన్‘ఎ’ తయారీకి ఉపయోగిస్తారు. నిమ్మగడ్డి తైలంలో “ సిట్రాల్ ” అనే రసాయనముంటుంది.

**నేలలు :** నిమ్మగడ్డిని అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. బలమైన ఎర్ర నేలల నుండి బలహీనమైన ఇసుక నేలల్లో కూడ సాగు చేయవచ్చు. బంజరు, బీడు మరియు అటవీ నేలల్లో కూడ సాగు చేయవచ్చు.

**అనువైన ప్రాంతాలు :** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో నీటివసతి కింద సాగుచేయవచ్చు. ఎత్తైన కొండప్రాంతాలలో వర్షాధారంగా కూడా సాగు చేయుటకు అవకాశముంది.

**నాటే సమయం, నాటే దూరం, మొక్కల మోతాదు :** నిమ్మగడ్డిని పిలకల ద్వారా వర్షాకాలంలో (జూన్-జూలై), వరుసలమధ్య 60 సెం.మీ. మరియు పిలకకు పిలకకు మధ్య 45 సెం.మీ. ఎడముంచి నాటాలి. మొక్కలు పడిపోకుండ మొక్కల మొదళ్ళలో మట్టిని ఎగదోసి గట్టిగా నొక్కాలి. నీటివసతి సౌకర్యముంటే తీవ్రమైన చలి మరియు వేసవిలో తప్ప నిమ్మగడ్డిని సంవత్సరం పొడవునా నాటుకొనవచ్చు. ఒక ఎకరా పొలంలో నాటటానికి షుమారు 15,000 పిలకలు అవసరం.

**రకాలు : కావేరి మరియు కృష్ణ**

**ఎరువులు :** ఎకరాకు ఆఖరి దుక్కిలో 4 టన్నుల పశువుల ఎరువు, 40 కిలోల యూరియా, 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్ మరియు 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. ప్రతి కోత తరువాత ఎకరాకు 40 కిలోల యూరియా రెండు దఫాలుగా వేయాలి(కోసిన వెంటనే మరియు 30-45 రోజుల తరువాత).

**నీటియాజమాన్యం :** వర్షాకాలంలో ఈ పంటకు నీరు అంతగా అవసరం ఉండదు. ఆ తర్వాత వాతావరణం, నేల స్వభావాన్ని బట్టి 10-15 రోజుల వ్యవధిలో నీటి తడులివ్వాలి. పిలకలునాటిన వెంటనే నీరు కట్టి తర్వాత 2 నుండి 3 రోజుల కొకసారి క్రమం తప్పకుండ నెల రోజుల వరకు నీరు పెట్టాలి.

**అంతరకృషి మరియు అంతరపంటలు :** నాటిన 3-4 నెలల వరకు, తదుపరి పంట కోసిన తర్వాత నెల రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. శీతాకాల ప్రారంభములో వచ్చే పూల కంకులను ఎప్పటి కప్పుడు తీసి వేయాలి. లేనిచో నిమ్మగడ్డి దిగుబడి తగ్గిపోవును. నాటిన 10-15 రోజుల తరువాత వరుసల మధ్య ఉలవలు లేదా ఏదైనా పప్పుజాతి పంటను విత్తుకున్న యెడల కలుపును చాలా వరకు నివారించుకోవచ్చు.

**సస్యరక్షణ** : ఆంధ్రప్రదేశ్‌లో నిమ్మగడ్డికి ఎటువంటి పురుగుల మరియు తెగుళ్ళ బాధలేదు. కావున సస్యరక్షణ చేపట్టాల్సిన అవసరంలేదు. మురుగునీటి సౌకర్యం సరిగా లేని చోట వేరుకుళ్ళు తెగులు సోకే అవకాశముంది కనుక జాగ్రత్త వహించాలి.

**పంటకోత** : మొదటి పంట నాటిన 5-6 మాసాల తర్వాత కోతకు వస్తుంది. తదుపరి కోత ప్రతి 2 1/2 - 3 మాసాల వ్యవధిలో వస్తుంది. ఒకసారి నాటిన పైరు నుండి 4-5 సంవత్సరాల వరకు పంట తీసుకోవడం లాభదాయకం. మొక్కలను నేల నుండి 10-15 సెం.మీ. వదిలి కోయాలి. పంటను కోసిన ప్రతిసారి ఎండు ఆకులను తీసివేయాలి. దీనివల్ల దుబ్బులు బాగా చిగురించి పెరుగుదల సంతృప్తికరంగా ఉంటుంది.

**నూనె తీసేపద్ధతి :** నిమ్మగడ్డి ఆకుల నుండి స్వేదన ప్రక్రియ (డిస్టిలేషన్) ద్వారా నూనెను తీస్తారు. ఈ నూనె తీసే యంత్రం డిస్టిలేషన్ ట్యాంకు, బాయిలర్, కండెన్సర్ మరియు సపరేటర్ అనే భాగాలను కల్గియుంటుంది. అప్పుడే కోసిన నిమ్మగడ్డి ఆకులను డిస్టిలేషన్ ట్యాంక్‌లోకి నింపి మూత మూసి నీటి ఆవిరిని పంపాలి. నూనె ఆవిరి, నీటి ఆవిరి ద్రవరూపంలో కండెన్సర్ ద్వారా సపరేటర్‌లోకి చేరుతాయి. నీటిపై తేలియాడే నూనెను వేరుచేసి, శుభ్రపర్చి గాజు లేక అల్యూమినియం పాత్రల్లో భద్రపర్చాలి. కొన్ని వృద్ధి పరచిన డిస్టిలేషన్ యంత్రాలలో సెపరేటర్ ద్వారా నీటిని, నూనెను వేరువేరుగా సేకరించుకోవచ్చు.

**ఆదాయం :** నిమ్మగడ్డి నుండి ఎకరాకు రకాన్ని బట్టి 60-90 కిలోల నూనె వస్తుంది. నీటివసతి కింద సాగు చేసినపుడు ఎకరాకు సంవత్సరానికి రూ. 10,000 నుండి రూ. 15,000 వరకు మరియు వర్షాధారంగా సాగుచేసినపుడు 40-45 కిలోల నూనె, రూ. 4,000 వరకు నికర ఆదాయాన్ని పొందవచ్చు.